సాక్షి
మంచిర్యాల

గురువారం : 20 : జూన్ : 2024



చెట్లు తొలగించాలని ఆందోళన

బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి, మందమర్రి మండలం చతులాపూర్ మధ్యలో రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లు తొలగించాలని గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. 8లో▸



బైక్ రేసింగ్..!

బెల్లంపల్లి పట్టణంలో చీకటి పడగానే బైక్ రేసింగ్ సాగుతోంది. బజార్ ఏరియాలో జనం రద్దీగా ఉన్న సమయంలో వేగంగా వెళ్లడానికి పందెం కాస్తున్నట్లు తెలుస్తోంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /28.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా గాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే వినోద్



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: జిల్లాకు బదిలీపై వచ్చిన కలెక్టర్ కుమార్ దీపక్‌ను బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మర్యాదపూర్వకంగా కలిశారు. బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ బెల్లంపల్లి మున్సిపల్ సమస్యలు విన్నవించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. శానిటేషన్ సిబ్బంది సంఖ్య పెంచడానికి అనుమతి ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని, సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు సత్వరంగా పూర్తి చేయించి వ్యాపారులకు గదులు కేటాయించాలని కోరారు. కలెక్టర్ కుమార్ దీపక్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

థీమ్ పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో థీమ్ పార్కు ఏర్పాటుకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి స్థలాలను పరిశీలించారు. శ్రీనివాస గార్డెన్, రాముని చెరువు ప్రాంతాలతోపాటు ఐబీ చౌరస్తాలోని జంక్షన్, ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతాలను సందర్శించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థలాలను పరిశీలిస్తున్నామని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఐబీ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు అన్ని అనుమతులతో సిద్ధంగా ఉన్నామని, ఎన్నికల కోడ్‌తో ఇన్నాళ్లు పనులు చేపట్టలేదని అన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మధు, ఏఈ రాజేందర్ పాల్గొన్నారు.

'కార్యకర్తల కష్టాల్లో పాలుపంచుకుంటా'



ఎంపీని సన్మానిస్తున్న కార్యకర్తలు

జన్నారం: కష్టపడి గెలిపించిన కార్యకర్తల కష్టాల్లో పాలుపంచుకుని సమస్యల పరిష్కారానికి, పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేష్ అన్నారు. గెలిచిన తర్వాత మొదటిసారి జన్నారానికి వచ్చిన ఆయనకు కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. బస్టాండ్ నుంచి అంగడిబజార్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీ నగేష్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిని పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మండల నాయకులు గోపాల్, తిరుపతి, గోలి చందు, సూర్యం, బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్, మండల నాయకులు పాల్గొన్నారు.

'పోడు భూములపై హామీ నెరవేర్చని ప్రభుత్వం'



మాట్లాడుతున్న గోమాసే శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు పోడు భూముల సమస్య పరిష్కరించి, పట్టాలు ఇస్తామని తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీ నెరవేర్చడం లేదని బీజేపీ పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ గోమాసే శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు, ఫారెస్టు అధికారులతో కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములను సాగు చేసుకుంటున్న వారిపై దమనకాండ సాగిస్తోందని ఆరోపించారు. నేతకాని సంఘ నాయకులు ఎస్కూరి రాజమల్లు, బీజేపీ నాయకులు రామగిరి శ్రీపతి, దుర్గం ఎల్లయ్య, దూడ రాజ్‌కుమార్, కొట్టి నాగేశ్వర్‌రావు, సల్లూరి వినోద్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పదోన్నతులు



కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీటీఎఫ్ బృందం



సినిమావాడ స్కూల్‌లో రిపోర్టు చేస్తున్న టీచర్

- జిల్లాలో 440 మందికి..
- కొత్త పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయులు ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న పదోన్నతుల ప్రక్రియను ఎట్టకేలకు పూర్తి చేశారు. ఎస్జీటీలు, పీఈటీలు, భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఉదయం నుంచి పదోన్నతుల కోసం ఎదురుచూస్తుండగా బుధవారం తెల్లవారుజామున విద్యాశాఖ ఉత్తర్వుల కాపీలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. హిందీ సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయుల జాబితాలో దొర్లిన తప్పులతో కొంతమేర ఆలస్యమైనా పరిష్కరించారు. దీంతో పాఠశాలలో రిలీవ్ అయిన ఉపాధ్యాయులు కొత్త స్కూళ్లలో విధుల్లో చేరారు.

440 మందికి..

ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశాలల్లో 440మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. తెలుగు, ఉర్దూ వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పీఎస్‌హెచ్‌ఎంలుగా 5, స్కూల్ అసిస్టెంట్లు(ఇంగ్లిషు) -1, ఉర్దూ-1, తెలుగు-1, బయోసైన్స్-3, హిందీ-5, ఫిజికల్ ఎడ్యుకేషనల్-3, ఫిజికల్ సైన్స్-2, సోషల్ స్టడీస్-1 మొత్తం 21 మంది ఉపాధ్యాయులకు ఎస్‌ఏలుగా పదోన్నతి కల్పించారు. లోకల్ బాడీలో పీఎస్‌హెచ్‌ఎంలుగా-39, ఎస్‌ఏ ఉర్దూ-2, ఎస్‌ఏ ఇంగ్లిష్-11, గణితం-24, తెలుగు-117, బయోసైన్స్-31(ఉర్దూ మీడియం-2), హిందీ-106, ఫిజికల్ ఎడ్యుకేషనల్-29, ఫిజికల్ సైన్స్-1(ఉర్దూ మీడియం), సోషల్ స్టడీస్-55(ఉర్దూమీడియం-1) మొత్తం 440 మందికి పదోన్నతి కల్పించగా ఉత్తర్వుల కాపీలు అందజేశారు. బుధవారం ఉపాధ్యాయులు వారికి కేటాయించిన కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేశారు.

తప్పని నిరీక్షణ..

పదోన్నతులపై ఉపాధ్యాయులు నిరీక్షించాల్సి వచ్చింది. సాంకేతిక కారణాలు, అభ్యంతరాలు, దొర్లిన తప్పుల వల్ల మంగళవారం రిలీవ్ కావాల్సిన ఉపాధ్యాయులకు బుధవారం ఆర్డర్ కాపీలను విద్యాశాఖ పొందుపర్చింది. కేవలం ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్ జిల్లాలో మాత్రమే అందరికంటే ముందు ప్రక్రియ పూర్తి చేయడం.. వివిధ కారణాలతో పదోన్నతులు నిలిచిపోయాయనే ప్రచారంతో ఉపాధ్యాయులకు నిరాశ కలిగింది.

అవకతవకలపై వినతి

పదోన్నతుల్లో అవకతవకలు జరిగాయని డీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. చనిపోయిన ఎస్జీటీకి పీఎస్‌హెచ్‌ఎంగా పదోన్నతి రావడం, పదోన్నతుల్లో డీఎస్సీలో వచ్చిన ర్యాంకు కాకుండా జాయినింగ్ తేదీని అర్హతగా తీసుకోవడం, అబద్ధపు పీహెచ్ సర్టిఫికేట్‌తో పదోన్నతి పొందిన వారు జాబితాలో ఉన్నారని పేర్కొన్నారు. ఒక్కో ఉపాధ్యాయునికి రెండు పదోన్నతులు రావడం, తప్పులన్నీ డీఈవో కార్యాలయం నుంచి వచ్చాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, ఉపాధ్యక్షుడు కుమార్, తదితరులు ఆరోపించారు.

అన్ని ఖాళీలు చూపించాలి

బదిలీల విషయంలో అన్ని ఖాళీలు చూపించి ఎస్జీటీలకు న్యాయం చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్ ప్రభుత్వాన్ని కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదలలో సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

ఉపాధ్యాయ పదోన్నతుల విషయంలో సొంత నిర్ణయాలు ఏమీ ఉండవు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక్క ఉపాధ్యాయునికి రెండు, మూడు పోస్టులు అర్హతను బట్టి అవకాశం కల్పించాం. ఏదో ఒక పోస్టులో మాత్రమే జాయిన్ అవుతారు. ఇదంతా రాష్ట్ర స్థాయిలో జరుగుతుంది. మృతిచెందిన వాళ్లు ఉంటే జాబితాలో తొలగించాం. ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి పదోన్నతుల విషయంలో అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ఖాకీల్లో బదిలీల టెన్షన్

- నచ్చిన చోట పోస్టింగ్ కోసం పైరవీలు
- ప్రస్తుత స్థానం కోసం కొందరి ప్రయత్నాలు
- నాడు ఎమ్మెల్యేల లెటర్.. నేడు నోటి మాట



మంచిర్యాలక్రైం: పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెల్లడై కోడ్ ముగియడంతో ఖాకీల్లో బదిలీల టెన్షన్ మొదలైంది. ఇప్పటికే మల్టీ జోన్-1లో 13మంది సీఐలు, ఇటీవల ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా మంచిర్యాల డీసీపీ బదిలీ అయిన విషయం తెలిసిందే. రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో వివిధ స్టేషన్లలో పని చేస్తున్న పోలీసు అధికారులు కొందరు ప్రస్తుత పోస్టింగ్‌ను కాపాడుకునేందుకు, మరికొందరు నచ్చినచోట పోస్టింగ్ దక్కించుకునేందుకు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేలు కొన్ని చోట్ల తమకు అనుకూలంగా ఉండే సీఐలకు పోస్టింగ్ ఇప్పించుకున్నారు. ఎన్నికలు పూర్తవడంతో ఎస్సై నుంచి ఉన్నతాధికారుల వరకు బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే కొందరు అధికారుల జాబితా ఎమ్మెల్యేల వద్దకు చేరినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఎవరెలా పని చేశారు, ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎవరికి అనుకూలంగా వ్యవహరించారనేది పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కొందరు ఎస్సై స్థాయి అధికారి నుంచి ఏసీపీ స్థాయి అధికారి వరకు ఎమ్మెల్యేలతో పైరవీలు చేసుకుంటున్నారు. ప్రతీసారి ఎన్నికల అనంతరం బదిలీలు సర్వసాధారణమే అయినా ఇదే అదునుగా కొందరు సీఐలు, ఎస్సైలు తమకు నచ్చిన పోస్టింగ్ కోసం ఖద్దరు చొక్కాలకు సలాం చేస్తున్నారు. ఎక్కువ శాతం వివిధ పనిష్మెంట్లు, వేకెన్సీ రిజర్వుడ్‌లోఉన్న అధికారులు, వివిధ విభాగాల్లో లూప్‌లైన్‌లో పని చేస్తున్న అధికారులు పోలీసుస్టేషన్లలో, డిమాండ్ ఉన్న ఠాణాల్లో పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారు. జిల్లాలో ఎన్నికల ముందు బదిలీ కాని అధికారులకు ఎలాగైనా బదిలీ జరిగే అవకాశం ఉండడంతో బదిలీ జరగకుండా ప్రయత్నాలు చేస్తున్నారు.

నచ్చిన పోస్టుకు రూ.లక్షలు..?

జిల్లాలో పోస్టింగ్ కావాలన్నా, ఉన్న పోస్టింగ్ కాపాడుకోవాలన్నా ఎమ్మెల్యేలకు రూ.లక్షలు ముట్టజెప్పాల్సిందేననే ఆరోపణలు ఉన్నాయి. అసాంఘిక కార్యకలాపాలు, ఇసుక అక్రమ రవాణా, సింగరేణి బొగ్గు గనులు, రైల్వేలైన్ ఉండడంతో గంజాయి దందా, రేషన్ బియ్యం, స్క్రాప్‌దందా, పేకాట ఇలా చాలానే ఉన్నాయి. నేరాలను నియంత్రించాల్సిన పోలీసు శాఖకు ముడుపుల పంట పండుతోంది. ఇలాంటి డిమాండ్ ఉన్న పోలీసుస్టేషన్లలో పోస్టింగ్‌కు పైరవీలు చేయడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల లెటర్ ఇస్తేనే ఉన్నాధికారులు పోస్టింగ్ ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం నోటిమాటగా చెబితే చాలు పోస్టింగ్ ఇస్తున్నారు. తమకు అనుకూలంగా ఎవరు పని చేస్తారనే అధికారుల జాబితాను ఇప్పటికే ఎమ్మెల్యేలు తెప్పించుకున్నట్లు సమాచారం.

జిల్లాలో డిమాండ్ ఉన్న పోలీస్‌స్టేషన్లు

జిల్లాలో కోల్‌బెల్ట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో పోస్టింగుల కోసం సంబంధిత ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ఎస్సైలు, సీఐలు ప్రదక్షిణ చేస్తున్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న పోలీస్‌స్టేషన్లలో మంచిర్యాల, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, చెన్నూర్, హాజీపూర్, జన్నారం, జైపూర్, సీసీసీ నస్పూర్, మందమర్రి, కోటపల్లి, రామకృష్ణాపూర్ ఉన్నాయి. వీటిల్లో పోస్టింగ్ దక్కాలంటే రూ.లక్షల్లో ముడుపులు చెల్లించాల్సిందేననే ఆరోపణలున్నాయి.

'నులి'పేద్దాం



మాత్రల పంపిణీపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో అనిత

- లేదంటే చిన్నారుల ఆరోగ్యానికి చేటు
- పట్టించుకోకుంటే అనారోగ్యమే
- నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

మంచిర్యాలటౌన్: బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన, చెప్పులు తొడుక్కోకుండా తిరగడం, ఆడుకోవడం, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రపర్చుకోకపోవడంతో పిల్లలు తరచూ కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతున్నారు. చిన్నారుల పొట్టలో తిష్టవేసి ఆరోగ్యాన్ని హరించే నులి పురుగులే కారణమని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. వాటిపై నిర్లక్ష్యం వహించినా, ముందు జాగ్రత్తలు తీసుకోకపోయినా ప్రాణాంతకంగా మారవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి రుగ్మతల నివారణకు ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినంగా నిర్వహించనున్నారు. నులి పురుగుల నివారణకు 1 నుంచి 19ఏళ్లలోపు పిల్లలకు గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ రోజు మాత్రలు తీసుకోని వారికి 27న వేయనున్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో వేసేందుకు అందజేశారు. అవగాహనకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత విడుదల చేశారు.

నులి పురుగులు అంటే..

నులి పురుగులు మానవుల పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులు. ఆరుబయట చెప్పులు లేకుండా ఆడుకోవడం, చేతులు కడుక్కోకుండా భోజనం చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, అపరిశుభ్ర పరిసరాలతో చిన్నారుల చెంతకు చేరుతాయి. నులి పురుగులు కలిగిన చిన్నారులు నులి పురుగుల గుడ్లు కలిగిన మలంతో నేలను కలుషితం చేస్తారు. ఈ గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెంది మిగతా పిల్లలు ఆరుబయట మట్టిని ముట్టడం, నులి పురుగుల గుడ్లు చేరిన ఆహారం తీసుకోవడం వల్ల కడుపులో వృద్ధి చెంది అక్కడే తిష్టవేస్తాయి. 19ఏళ్లలోపు పిల్లల ఆరోగ్యంపై ఇవి ప్రభావం చూపుతాయి. ఆకలి మందగించడం, రక్తహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, అతిసారం, మలంలో రక్తం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

చప్పరించి మింగాలి

జిల్లాలోని 1–19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 2,01,143 మంది ఉన్నట్లుగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ పూర్తి చేశారు. మధ్యాహ్న భోజనం తర్వాత అందించనున్నారు. 1–2 సంవత్సరాల పిల్లలకు అరమాత్ర, 2నుంచి 3 ఏళ్ల వారికి ఒక మాత్ర పొడి చేసి నీటితో మింగించాలి. 3–19 ఏళ్ల వారు ఒక మాత్రను చప్పరించి మింగాలి. ఇది నేరుగా మింగే మాత్ర కాదు.

జిల్లాలో...

పిల్లలు	2,01,143
ప్రభుత్వ హాస్టళ్లు	92
అంగన్‌వాడీ కేంద్రాలు	969
ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు	954
ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు	48
ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	27
మాత్రలు వేసే ఏఎన్‌ఎంలు	263
మాత్రలు వేసే ఆశా కార్యకర్తలు	663
అంగన్‌వాడీ టీచరు	822
మానిటరింగ్ టీంలు	4

తప్పనిసరిగా మాత్ర వేయాలి



నులి పురుగుల నివారణకు పరిశుభ్రతనే తప్పనిసరి. చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం మానుకోవాలి. ఆహారంపై ఈగలు, దోమలు, కీటకాలు వాలకుండా చూడాలి. పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో కడిగి వండుకోవాలి. స్వచ్ఛమైన నీటినే తాగాలి. చేతిగోర్లను చిన్నగా కత్తిరించుకుని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలవిసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో కడుక్కోవాలి. చెప్పులు, బూట్లు ఉంటేనే బయటకు వెళ్లాలి. వైద్యులు సూచించినట్లుగా అల్బెండజోల్ మాత్రను పిల్లలకు తప్పనిసరిగా తినిపించాలి.

– డాక్టర్ అనిత, జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల

సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనకు కృషి

- కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిరూరల్: సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పక్షోత్సవ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా వైద్యాధికారి అనితతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత గిరిజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో జూలై 3వరకు సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందమర్రిలో 430మందికి సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారని, జిల్లా వ్యాప్తంగా 149 ఆరోగ్య ఉప కేంద్రాలు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాల్లో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు అవగాహన కల్పిస్తూ నిర్మూలనకు కృషి చేస్తున్నారని అన్నారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి గంగారాం, ప్రోగ్రాం ఆఫీసర్ ఫయాజ్, డీపీవో ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారులు నాందేవ్, సత్యనారాయణ, వైద్యాధికారి రమేష్, స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం సందర్శన

మందమర్రి మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్ బుధవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. చెత్లాపూర్ సమీపంలోని డంపింగ్‌యార్డును సందర్శించి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును అడిగి వివరాలు తెలుసుకున్నారు. సారంగపల్లి నర్సరీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీపీవో వీరయ్య, ఎంపీవో భీరయ్య, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్, డీటీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

కోటపల్లి: 108 అంబులెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అన్నారు. బుధవారం కోటపల్లి 108 వాహనాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య పరికరాలు, అందుబాటులో ఉన్న వివిధ రకాల మందులు, మెడికల్ కిట్లు, రికార్డులు పరిశీలించి వాహన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా 108వాహనాల కార్యనిర్వహణ అధికారి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికి మరింత 'మద్దతు'

- క్వింటాల్‌కు రూ.500 పెంపు
- కనీస మద్దతు ధరలు ప్రకటించిన కేంద్రం
- వరికి నామమాత్రమే..



సాగు భారం

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర పెంచుతూ రైతులకు తీపి కబురు అందించింది. 14పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పెంచుతూ బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, కంది పంటలు అధికంగా సాగవుతుండగా.. పెంచిన ధరలు సోయాబీన్, కంది పంటలకు కాస్త ఊరటనివ్వగా వరి పంట ధర రైతులను నిరాశకు గురి చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 17.20లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. అధికంగా తృణధాన్యాలు, నువ్వు, పెసర పంటలకు ధర పెంచారు. కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ) సూచించిన ధరలు సాగుకయ్యే ఖర్చు కన్నా తక్కువగానే ఉన్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అనుగుణంగా ధరలు పెంచాలని కొద్ది రోజుల క్రితం సీఏసీపీకి విజ్ఞప్తి చేశారు. రైతు కమిటీల సిఫారసుల ప్రకారం సాగుకు చేసే ఖర్చుకు అదనంగా మరో 50 శాతం కలిపి ధర ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఆయా పంటలకు రూ.117 నుంచి రూ.983 వరకు ధరలు పెరిగాయి. ఈ ఏడాదైనా పత్తికి క్వింటాల్‌కు రూ.8వేలు, వరికి రూ.3వేలు, సోయాకు రూ.6వేల వరకు చెల్లించాలని పలు రైతుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు, కూలీల ఖర్చు, వ్యవసాయ యంత్రాల ధరలు, ఇంధన ధరలు రెట్టింపు అయ్యాయి. వివిధ రకాల పంట సాగుకు పెట్టుబడులు వేలకు వేలు పెరుగుతూ వస్తున్నాయి. పత్తి పంటకు ఎకరాకు రూ.43 వేల వరకు, వరి, సోయా పంటలకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. సాగుకు సకాలంలో బ్యాంకు రుణాలు అందక అప్పు చేసి వేలల్లో నష్టపోతున్నారు. కనీసం కొద్దిపాటి దిగుబడి వచ్చినా పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధరలతో రైతుకు అండగా నిలవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 5.30 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు, మరో 55 వేల మంది కౌలు రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. 70 శాతం వర్షధారం పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ ఏడాదైనా దిగుబడి వచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఆశించిన రైతులకు మరోసారి నిరాశే ఎదురైంది.

రెండేళ్లలో పెరిగిన ధరలు

పత్తి సాగుకు రూ.35,000 నుంచి రూ.43,000, సోయాకు రూ.26,000 నుంచి రూ.30,000 వరకు, వరికి రూ.25,000 నుంచి రూ.32,000 వరకు పెట్టుబడి పెడుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. పెట్టుబడి ఖర్చులతో పోల్చుకుంటే మద్దతు ధరలు ఏమాత్రం సరిపోవని పేర్కొంటున్నారు. గతంలో దుక్కి దున్నడానికి ట్రాక్టర్‌కు గంటకు రూ.700 ఉండగా పెరిగిన డీజిల్ ధరలతో ప్రస్తుతం రూ.1000, ఒక మనిషికి కూలి రూ.400 ఉండగా ఇప్పుడు రూ.600 తీసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెరిగాయి.

పెరిగిన ధరలు(రూ.లలో) క్వింటాల్‌కు ఇలా

పంట	గతేడాది	ఈ ఏడాది	పెరిగింది
పత్తి	7,020	7,521	501
వరి(ఏ గ్రేడ్ రకం)	2,183	2,300	117
కంది	7,000	7,550	550
పెసర	8,558	8,682	124
సోయాబీన్	4,600	4,892	292
నువ్వులు	8,365	9,267	632
మొక్కజొన్న	2090	2,225	135
వేరుశనగ	6,377	6,783	406
జొన్న	3,225	3,416	191
మినుము	6,950	7,400	450
పొద్దుతిరుగుడు	6,760	7,400	450

రూ.8 వేలు ఉంటదనుకున్నా..



పత్తి సాగుకు ఏటికేటా వేలకు వేలు పెట్టుబడి పెరిగిపోతోంది. మద్దతు ధర ఏదో నామ్‌కే వాస్తే అన్నట్లు రూ.100, రూ.200 పెంచుతున్నారు. కూలీల ఖర్చు, ట్రాక్టర్‌కు డీజిల్ ధరలు పెరిగాయి. ఈ ఏడాది రూ.8 వేలు పైన ఉంటుందని అనుకున్నా. కానీ రూ.200 పెంచిడ్రు. ఇప్పటికైనా పునరాలోచించి ధరలు పెంచాలి.

– భీమరాజుల వెంకన్న, నెన్నెల

ఈ ధరలు నిరాశే..

గతంలో కూలీకి రూ.400 ఇస్తే అచ్చేటోళ్లు. ఇప్పుడు రూ.700 ఇస్తేగానీ రావడం లేదు. విత్తనాలు, ఎరువుల ధరలు బాగా పెరిగిపోయాయి. పది ఇరువై పెంచుతున్నరు. వేలకు వేలు పంటకు ఖర్చు అయితంది. గీ ధరలు గిట్టుబాటు కావు.

– పి.మురళి, హాజీపూర్

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

లింగాపూర్(ఆసిఫాబాద్): ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లాపటార్ గ్రామానికి మహమ్మద్ అఫ్సర్(27) గ్రామ శివారులో బుధవారం ట్రాక్టర్‌తో వ్యవసాయ చేను దున్నేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి సమీపంలోని లోయలో బోల్తాపడింది. సమీపంలో ఉన్న అతడి సోదరుడు మహమ్మద్ హాకాని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. లోయ నుంచి అప్సర్‌ను బయటికి తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి సోదరుడు హాకాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను కొట్టిన కేసులో ముగ్గురికి జైలు

రామకృష్ణాపూర్:మహిళను కొట్టిన కేసులో ముగ్గురికి నెల రోజుల జైలుతోపాటు రూ.వేయి జరిమానా విధిస్తూ మంచిర్యాల ప్రిన్సిపల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ సంపత్ బుధవారం తీర్పునిచ్చినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పులిమడుగు గ్రామానికి చెందిన భూక్య బాబురావు, భూక్య భీమా, భ్యూక్య ప్రవీణ్‌లు అదే గ్రామానికి చెందిన భుక్య లక్ష్మిని 2021 జనవరిలో కొట్టి బెదిరించారని తెలిపారు. ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, ఈ మేరకు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారని తెలిపారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ మండల కేంద్రంలోని దీక్షిత ఫర్టిలైజర్ షాపులో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో చోరీ జరిగింది. షాపులో నుంచి రూ.2.38 లక్షల నగదు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకుడు కవ్వాల సాయి తెలిపారు. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాదిక్ పాషా డాగ్స్‌స్క్వాడ్ సాయంతో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఏఎస్సై మోహన్, కానిస్టేబుల్ విష్ణు తదితరులు ఉన్నారు.

చిన్నారులపై పిచ్చికుక్క దాడి



తీవ్రంగా గాయపడిన అయాన్ష్



చిన్నారి చేతిపై గాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సాయినగర్, రాజంపేట కాలనీల్లో బుధవారం పిచ్చికుక్కలు దాడులకు దిగాయి. రాజంపేట కాలనీల్లో ఆరుబయట ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులను ఓ కుక్క గాయపర్చింది. వీరిని కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. తీవ్రంగా గాయపడిన రిషితోపాటు 11 నెలల అయాన్ష్‌ను వైద్యులు మంచిర్యాల ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆశ్విత అనే ఎనిమిదేళ్ల చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా.. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ సిబ్బంది కర్రలతో కుక్కలను తరిమివేసేందుకు చర్యలు చేపట్టారు.

బైక్ రేసింగ్..!

- బెల్లంపల్లిలో హడలెత్తిస్తున్న ఆకతాయిలు
- రద్దీ సమయంలో దూసుకెళ్తున్న యువకులు
- అదుపుతప్పి ఢీకొంటున్న వైనం
- ర్యాష్‌డ్రైవింగ్ నిత్యకృత్యం



బెల్లంపల్లి పట్టణంలో రద్దీగా ఉండే ప్రాంతం

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో చీకటి పడగానే బైక్ రేసింగ్ సాగుతోంది. బజార్ ఏరియాలో జనం రద్దీగా ఉన్న సమయంలో వేగంగా వెళ్లడానికి పందెం కాస్తున్నట్లు తెలుస్తోంది. బూడిదగడ్డ చౌరస్తా నుంచి బజార్ ఏరియా ప్రాంతం మీదుగా కన్నాల రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు గమ్యస్థానం చేరుకుంటే పందెం గెలిచినట్లు.. ఏమాత్రం ప్రమాదం జరిగినా, మరే కారణంతోనైనా ఆలస్యమైతే ఓడిపోయినట్లుగా చర్చించుకుంటున్నారు. కొందరు యువకులు, ఆకతాయిలు అదుపు చేయలేనంత వేగంగా, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వెళ్లడం వల్ల మహిళలు, వృద్ధులు, ఇతర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదానికి గురై గాయపడినా, ఒక్కోసారి ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడినా యువకుల్లో మార్పు రావడం లేదు. ప్రమాదం జరిగిన తర్వాత తెలిసిన వారి ద్వారా సంప్రదింపులు చేసి రాజీ కుదుర్చుకుంటున్నారు. ఈ కారణంగా రోడ్డు ప్రమాద ఘటనలు చాలావరకు పోలీసుస్టేషన్ వరకు వెళ్లడం లేదు.

భారీ శబ్దంతో హారన్

చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి వాణిజ్య కేంద్రం బెల్లంపల్లికి ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వందల సంఖ్యలో ఆటోలు, మోటార్‌సైకిళ్లు, ఇతర వాహనాల్లో వచ్చి వెళ్తుంటారు. వీటికి అదనంగా అన్ని రకాల వాహనాలు బెల్లంపల్లిలో వేల సంఖ్యలో రోడ్డెక్కుతాయి. ఆసిఫాబాద్, మంచిర్యాల ఆర్టీసీ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు బజార్ ఏరియా మీదుగా ఇరువైపులా రవాణా అవుతుంటాయి. దుకాణ సముదాయాలన్నీ కూడా బజార్ ఏరియా ప్రాంతంలో ఉండడంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇదే దారిలో ఆకతాయిలు వేగంగా దూసుకెళ్తూ భారీ శబ్దంతో హారన్ కొడుతున్నారు. వేగానికి బాటసారులు, తోటి వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్తుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు క్రాస్ చేయాల్సి వస్తోంది. రెప్పపాటు క్షణం ఏమరుపాటుగా వ్యవహరించినా ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉంటాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మోటార్‌సైకిల్‌పై ముగ్గురు వెళ్తుండడం, మైనర్లు ర్యాష్ డ్రైవింగ్ చేయడం పరిపాటుగా మారింది. ఇటీవల బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు తగ్గడంతో యువకులు మరింత రెచ్చిపోతున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి బైక్ రేసింగ్, ర్యాష్ డ్రైవింగ్ అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కొన్ని ప్రమాద ఘటనలు

- రెండు నెలల క్రితం బజార్‌ఏరియాలో రాత్రి 9గంటల ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు మరో బైక్‌ను వేగంగా ఢీకొట్టడంతో వాహనదారుడికి గాయాలు అయ్యాయి.
- నెల క్రితం బజార్ ఏరియా ప్రాంతం ఎస్‌బీఐ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టింది. కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.
- కాంటా చౌరస్తా వద్ద వెనుక నుంచి వేగంగా వెళ్లి ఓ వ్యక్తి బైక్‌ను ఢీకొట్టడంతో ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యాయి.
- పాత బస్టాండ్ ఏరియా సింగరేణి తిలక్ స్టేడియం ప్రధాన ద్వారం ముందు ఓ యువకుడు వేగంగా బైక్ నడిపి గ్రౌండ్ నుంచి రోడ్డెక్కి నడిచి వెళ్తున్న మహిళను ఢీకొట్టాడు. సదరు యువకుడు డివైడర్‌పై పడి తీవ్రంగా గాయపడగా, మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి.

ర్యాష్ డ్రైవింగ్ అరికట్టాలి



జన సమూహంలో కొంతకాలం నుంచి ర్యాష్ డ్రైవింగ్ చేయడం ఆకతాయిలకు సరదాగా మారింది. ఎంతమంది వారించినా పద్ధతి మార్చుకోవడం లేదు. కొందరి వల్ల అమాయకులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉంటున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటివి కొనసాగకుండా చర్యలు చేపట్టాలి.

– రత్నం ఐలయ్య, బెల్లంపల్లి

చర్యలు తీసుకోవాలి



రోజువారీగా పోలీసులు బజారు ఏరియాలో వాహనాల తనిఖీలు చేపడుతున్నా జులాయిల ర్యాష్ డ్రైవింగ్ ఆగడం లేదు. ఏదో తీరుగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూనే ఉన్నారు. పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులను పట్టుకుని చర్యలు తీసుకోవాలి.

– పి.సురేష్, బెల్లంపల్లి

డిస్మిస్ ఆదేశాలు నిలిపివేయాలి

శ్రీరాంపూర్: గైర్హాజరు పేరుతో కొందరు కార్మికులకు యాజమాన్యం ఇచ్చిన డిస్మిస్ ఆదేశాలను వెంటనే నిలిపివేయాలని హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో కొంతకాలంగా విధులకు హాజరుకాని వారిని యాజమాన్యం కుట్రపూరితంగా డిస్మిస్ చేసి లెటర్లు గనుల పైకి పంపించిందని పేర్కొన్నారు. వెంటనే ఆర్డర్ కాపీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సింది పోయి అకారణంగా డిస్మిస్ చేశారని ఆరోపించారు.

ఈపీ ఆపరేటర్ ట్రైనీ పరీక్షలో 87 మంది ఎంపిక

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన ఈపీ ఆపరేటర్ ట్రైనీ పరీక్షలో 87మంది ఎంపికైనట్లు ఏరియా ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి తెలిపారు. బెల్లంపల్లి రీజియన్ వ్యాప్తంగా 191 మంది దరఖాస్తు చేసుకోగా 15 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన పరీక్షలో 100 మందిలో 90 మంది పాల్గొనగా 46మంది, బుధవారం 91మందిలో 86 మంది పాల్గొనగా 41మంది ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఈ నెల 30న కొత్తగూడెంలో రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం (కార్పొరేట్) సంతోష్, డీవైపీఎం సత్యబోస్, ఎస్ఈ(వర్క్‌షాప్) నాగరాజ్‌నాయక్, అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై 'ఎక్సైజ్' దాడులు



గుడుంబా తయారీ సామగ్రితో అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి, కైరిగూడ గ్రామాల పరిసరాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేసిన గుడుంబా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. బెల్లం పానకం ధ్వంసం చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గోలేటి, కైరిగూడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్థావరాలపై దాడులు చేసి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా, అనుమతి లేకుండా మద్యం అమ్మకాల గురించి సమాచారం ఉంటే సమాచారం అందించాలని సీఐ దీపక్ కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు రమేశ్, సంధ్యారాణి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్వర్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు సురేశ్, కమలాకర్, మమత, రజిత, ధను, నవీన్ పాల్గొన్నారు.

వరుస చోరీల దొంగ అరెస్టు



అరెస్టయిన నిందితుడితో సీఐ, ఎస్సై

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన నన్నెపురాజు చంద్రకాంత్ గత కొంతకాలంగా మంచిర్యాల నివాసం ఉంటూ జల్సాలకు అలవాటుపడ్డాడని తెలిపారు. అమ్మాగార్డెన్స్ ఏరియాలోని ఓ ఇంటితోపాటు మల్లిఖార్జుననగర్ ఏరియాలోని మరో ఇంట్లో ఇటీవల చోరీకి పాల్పడి రెండు ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడని పేర్కొన్నారు. బుధవారం క్యాతనపల్లి వద్ద అనుమానాస్పదంగా కనిపించగా విచారణలో దొంగతనం విషయం బయటకు వచ్చిందని తెలిపారు. నిందితుడి నుంచి రెండు ల్యాప్‌ట్యాప్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- గజ్వేల్ సమీపంలో లారీని ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు



తిరుపతి(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌కు వెళ్లి వస్తుండగా గజ్వేల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫాబాద్ మండలం రహపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రహపల్లికి చెందిన ఆడే తిరుపతి(28), పోశన్న, రాములు కలిసి అనారోగ్యం బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన చిన్మయ గిరిస్వామిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి ఈ నెల 18న కారులో తీసుకెళ్లారు. చిన్మయ గిరిస్వామిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన అనంతరం వీరు ముగ్గురు అదే కారులో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో గజ్వేల్ సమీపంలో ఆగి ఉన్న లారీని వీరు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న తిరుపతి అక్కడికక్కడే మృతి చెందగా.. పోశన్న, రాములు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా.. ఆడే తిరుపతికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కేకే ఓసీలో కాంట్రాక్టు కార్మికుల సమ్మె



కార్మికులతో చర్చిస్తున్న జీఎం, అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓపెన్‌కాస్టులో మంగళవారం రాత్రి షిఫ్టు నుంచి కాంట్రాక్టు కార్మికులు వేతనాలు పెంచాలని సమ్మెకు దిగారు. ఆర్‌వీఆర్ కంపెనీ స్పందించకపోవడంతో బుధవారం నుంచి సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కార్మికులతో మాట్లాడి చర్చలకు జీఎం కార్యాలయానికి తీసుకెళ్లారు. సదరు కాంట్రాక్టు బాధ్యులు స్పందించకపోవడంతో చర్చలు విఫలమై సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మొదటి నుంచీ సదరు కంపెనీ నిర్వాహకులు కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, పలుమార్లు ఆందోళనలు చేసినా స్పందించలేదని విమర్శించారు. త్వరలో గడువు ముగుస్తుందని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్న యాజమాన్యం'

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థకు వేల కోట్ల లాభాలు వస్తున్నా కార్మిక సంక్షేమాన్ని యాజమాన్యం పూర్తిగా గాలికొదిలేస్తుందని హెచ్‌ఎంఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఓజియార్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి హాస్పిటల్స్‌లో సరైన వైద్యసిబ్బంది లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. స్పెషలిస్టు డాక్టర్లను నియమించాల్సి ఉండగా.. ఉన్న ఆస్పత్రులనే ఎత్తివేసే దిశగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల పోటీ పడుతున్నాయని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు 275 పడకలతో ఉన్న బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిని 50 పడకలకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. గుర్తింపు సంఘం నాయకులు యాజమాన్యంతో చర్చించి ఏరియా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఏరియా కార్యదర్శి ఎస్కే ఇనూస్, ఫిట్ కార్యదర్శి ఆరీఫ్, తిరుపతి, హాస్పిటల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ -2025(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి.వినోద్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు జి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 18 నుంచి ఏప్రిల్ 18, 2025 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, జూలై 3లోగా హైదరాబాద్‌లోని సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీలో టీజీబీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఉచిత గ్రూప్-2 గ్రాండ్ టెస్టులకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: టీజీపీఎస్సీ, గ్రూప్-2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత గ్రాండ్ టెస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి.వినోద్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు జి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తామని, అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www. tgbcstudycircle. cgg. gov. in ద్వారా జూలై 5లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూలై 8, 9, 15, 16, 22 23, 30, 31 తేదీల్లో పరీక్షలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఐటీఐలో సర్వే పనులు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం ఐటీఐ ఆధునీకరణలో భాగంగా బుధవారం మంచిర్యాల ఐటీఐలో సర్వే పనులు ప్రారంభించారు. అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ కోసం పనులు చేపట్టారు. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంటు (డీజెడ్ఎం) వై.ఉమామహేశ్వర్, కాంట్రాక్టర్ వేణు సర్వే చేశారు. పనులు పూర్తయితే భవనాలు, ఇతర ఆధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయని ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



టీచర్లకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు కొత్తగా వచ్చిన పాఠ్యపుస్తకాలను బుధవారం జిల్లా కేంద్రంలోని సీడీపీవో కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. నూతన పాఠ్య ప్రణాళికకు అనుగుణంగా టీచర్లు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలనే ఉద్దేశంతోనే ప్రతీ టీచరుకు మూడు రోజులపాటు ఆయా పాఠ్యాంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను టీచర్లు సద్వినియోగం చేసుకుని చిన్నారులకు ప్రణాళిక ప్రకారంగా బోధన జరిగేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మీ, మాస్టర్ ట్రైనర్లు చందన, ప్రసన్న, సరిత, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఫైర్ ఫైటింగ్ సిస్టంను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సీహెచ్‌పీ, ఓసీపీల్లో భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం సీహెచ్‌పీలో నూతనంగా ఏర్పాటు చేసిన డస్ట్ సప్రెషన్, ఫైర్ ఫైటింగ్ సిస్టంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో దుమ్ము నివారణే కాకుండా మంటలు వస్తే అదుపు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఓటు జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు సిబ్బందిని నియమించాలి



ఎమ్మెల్యేకు సమస్యను విన్నవిస్తున్న సిబ్బంది

బెల్లంపల్లి: సరిపడా సిబ్బంది లేక పనిభారంతో సతమతం అవుతున్నామని, వెంటనే అదనపు సిబ్బందిని నియమించాలని బెల్లంపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కోరారు. బుధవారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. మున్సిపాలిటీలో 60 మంది సిబ్బంది ఉండగా వీరిలో 34 వార్డులకు ఒక్కో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించడంతో ఆయా వార్డుల కౌన్సిలర్లు తమ సొంత ఇంటి పనులకు వినియోగిస్తుండడంతో మిగిలిన వారిపై పని భారం పడుతోందని వివరించారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు సరికాదు



మాట్లాడుతున్న డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి

మంచిర్యాలటౌన్: వైద్యులంటే ప్రాణాలు పోసేవారే గానీ ప్రాణాలు తీసేవారు కాదని, అకారణంగా వైద్యులను ఇష్టారీతిన దూషిస్తూ, దాడులు చేసేలా ప్రవర్తించడం సరికాదని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్ఎంవోలు శ్రీమన్నారాయణ, డాక్టర్ భీష్మ, ఎంసీహెచ్ గైనకాలజిస్టులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బెల్లంపల్లికి చెందిన గంగ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవించిన ఐదు రోజుల తర్వాత నడుం లేవడం లేదని అన్నారని, స్కానింగ్ కోసం తామే పంపిస్తే వివరాలు తెలుసుకోకుండానే నరం కట్ చేశారంటూ తమ వైద్యులపై 50మందికి పైగా ఒకేసారి ఆందోళనకు దిగారని అన్నారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి పంపిస్తే అక్కడి వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి ఎలాంటి నరం కట్ కాలేదని, దీర్ఘకాలిక వ్యాధులు ఆపరేషన్ సమయంలో ఇలా బయటపడతాయని చెప్పారని, ప్రస్తుతం గంగ కోలుకుంటోందని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యులు నాగసింధు, అలివేణి, కీర్తిశ్రీ, ప్రశాంతి, ప్రసన్న, గణేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచాలి



వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

జన్నారం: అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని మంచిర్యాల ఐసీడీఎస్ డీడబ్ల్యూవోకు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. వీరికి మద్దతుగా ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సరస్వతి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కలిందర్ అలీఖాన్, యూనియన్ నాయకులు కృప, రమాదేవి, బుచ్చమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

చెట్లు తొలగించాలని ఆందోళన

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీ నుంచి మందమర్రి మండలం చతులాపూర్ గ్రామం వరకు రూ.2.81 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనుల్లో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. గ్రామ శివారులో ఓ రైతు రోడ్డు పక్కన తన భూమిలో టేకు చెట్లను పెంచుతున్నాడు. రోడ్డు నిర్మాణం కోసం అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని గ్రామస్తులు పలుమార్లు సదరు రైతుకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. బుధవారం గ్రామస్తులు సదరు రైతు చెట్లను తొలగించాలని ఆందోళన చేపట్టారు. దీంతో రైతు, గ్రామస్తుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. అనుమతి పొందిన తర్వాతే చెట్లను తొలగించాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. త్వరితగతిన చెట్లను తొలగించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చొరవ తీసుకుంటామని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.